సాక్షి వికారాబాద్

శనివారం : 19 : అక్టోబర్ : 2024



యాసంగి సాగుకు వేళాయె

యాసంగి పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 10లో▸



పక్కాగా 'మాస్టర్ ప్లాన్'

డిజిటల్ సర్వే వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని చైర్‌పర్సన్ మంజుల అన్నారు. 10లో▸



ప్రమాదకరంగా కల్లాలు

రోడ్లపై రైతులు ఏర్పాటు చేస్తున్న కల్లాలు వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. 11లో▸

న్యూస్‌రీల్

మంత్రి తుమ్మలను కలిసిన బాల్‌రెడ్డి



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్లు

తాండూరు టౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం జిల్లాలోని మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో బాల్‌రెడ్డి మంత్రిని కలిసి వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కోట్‌పల్లి, బషీరాబాద్ మార్కెట్ కమిటీల చైర్మన్లు అంజయ్య, మాధవరెడ్డి, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, డైరెక్టర్ ఉదయ్ భాస్కర్ మంత్రిని కలిశారు.

జోరుగా టీచింగ్ ఆస్పత్రి భవన నిర్మాణం



కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో టీచింగ్ హాస్పిటల్ భవన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. మెడికల్ కళాశాలకు అనుబంధంగా 220 పడకల సామర్థ్యం కలిగిన టీచింగ్ హాస్పిటల్‌ను నిర్మిస్తున్నారు. ఇందుకోసం రూ.27 కోట్లు కేటాయించారు. మండలంలోని అప్పాయిపల్లి శివారులో మెడికల్ కళాశాల నిర్మించనున్నారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. మెడికల్ కళాశాల భవన సముదాయం, మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.124.50 కోట్లు మంజూరు చేసింది. దీనికి అనుబంధంగా నర్సింగ్ కళాశాలను నిర్మించనున్నారు. ఇందు కోసం రూ.46 కోట్లు మంజూరు చేశారు. ఫిజియోథెరపీ కళాశాల, పారా మెడికల్ కళాశాల భవన నిర్మాణాల కోసం రూ.27 కోట్లు మంజూరు చేశారు. త్వరలో ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గిరిజన గురుకులంలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీ కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీటీ మాథ్స్, పీజీటీ బయోలాజికల్ సైన్స్, పీజీటీ సోషల్, టీజీటీ ఇంగ్లిష్, జేఎల్ ఇంగ్లిష్ పోస్టులకు ఈ నెల 19వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21న హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని మానస హిల్స్‌లో ఇంటర్వ్యూ, డెమో ఉంటుందని తెలిపారు. పీజీటీ, జేఎల్ పోస్టుల కోసం ఎంఎస్సీ, బీఈడీ, టీజీటీ బీఎస్సీ బీఈడీ విద్యార్హత అన్నారు.

తాండూరు మహిళకు అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉమాదేవి

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యూట్ బ్యాగుల తయారీ పరిశ్రమను నెలకొల్పిన తాండూరు పట్టణానికి చెందిన జి ఉమాదేవికి గ్లోబల్ ఉమెన్ ఇన్స్పిరేషన్ అవార్డు దక్కింది. షీ ఇన్‌స్పైర్ ఉమెన్ అనే సంస్థ దేశంలో మహిళల సారథ్యంలో కొనసాగుతున్న పర్యావరణ పరిరక్షక వ్యాపార ఉత్పత్తుల విభాగంలో 100 మంది మహిళలకు గురువారం ఢిల్లీలో అవార్డులు అందజేసింది. తాండూరులో జ్యూటిపై అనే పేరుతో జ్యూట్ బ్యాగుల పరిశ్రమను నెలకొల్పి పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు, పలువురికి ఉపాధి కల్పిస్తున్నందుకు ఆమెను ఈ అవార్డు వరించింది. తాండూరుకు చెందిన మహిళకు అవార్డు దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ.. ప్లాస్టిక్ పెనుభూతంగా మారి పర్యావరణాన్ని కలుషితం చేస్తూ, జీవజాతికి ఎంతో హాని తలపెడుతోందన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా ప్రత్యామ్నాయంగా తాను జ్యూటిపై పేరుతో తాండూరులో జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశానన్నారు. ఇంట్లో అవసరాలకు, శుభకార్యాలకు ఇతరత్రా వాటికి ఉపయోగించే విధంగా జ్యూట్ బ్యాగులను తయారు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

తెగని డీఎస్సీ పంచాయితీ!

స్పెషల్ ఎడ్యుకేషన్, పీఈటీ అభ్యర్థుల ఎంపికలో లోపాలు

- ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల విషయంలో ఫిర్యాదులు
- 'ఆర్‌సీఐ' వ్యాలిడిటీ లేకున్నా ఎంపిక
- కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్‌ను కలిసిన బాధితులు
- అభ్యంతరాల పరిశీలనకు ఫైవ్‌మెన్ కమిటీ



ఇటీవల కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

వికారాబాద్: డీఎస్సీ కౌన్సిలింగ్‌లో నెలకొన్న గందరగోళ పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ బాధిత అభ్యర్థులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తయి వారం రోజులు గడిచినా అభ్యంతరాలకు పరిష్కారం దొరకలేదు. అనర్హులను ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారంటూ బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో అభ్యంతరాలు వచ్చిన పోస్టులకు సంబంధించి అభ్యర్థులకు జాయినింగ్ ఆర్డర్ కాపీలు ఇవ్వకుండా ఆపేశారు. వారం రోజుల నుంచి అటు ఫిర్యాదుదారులు ఇటు టీచర్ పోస్టులకు ఎంపికై జాయినింగ్ ఆర్డర్ కాపీ పొందని వారు కలెక్టర్, డీఈఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. వ్యాయామ, స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎస్టీటీ) అభ్యర్థుల ఎంపికలో, ఈడబ్ల్యూఎస్ కోటాలో ఉద్యోగాలు పొందిన వారి విషయంలో మిగతా అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. ఈ మూడు విభాగాలకు సంబంధించి 21 మంది అభ్యర్థులకు జాయినింగ్ ఆర్డర్ కాపీలను ఆపేశారు.

వివాదం మొదలయ్యిందిలా..

సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో జరిగిన అవకతవకల వల్ల స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోటా క్యాటగిరిలో ఉపాధ్యాయ అభ్యర్థుల ఎంపికలో అనర్హులను ఎంపిక చేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. అర్హులైన 21మందికి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మార్(మెంటల్లీ రిటార్డెడ్) విద్యార్థులకు బోధించాలంటే ఆ సబ్జెక్టులో స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ పూర్తి చేసి ఉండాలి. దాంతో పాటు ఆర్‌సీఐ (రీహ్యాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) సర్టిఫికెట్ వ్యాలిడిటీ ఉండాలి. అయితే మొదటి సారి ఈ డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 20 పోస్టులు భర్తీ చేశారు. ఇందులో నలుగురు అభ్యర్థులను ఆర్‌సీఐ సర్టిఫికెట్ వ్యాలిడిటీ లేకపోయినా ఎంపిక చేశారని బాధితులు తెలిపారు. ఆర్‌సీఐ వ్యాలిడిటీ లేని వివరాలను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు పీడీ(ఫిజికల్ డైరక్టర్) పోస్టుల ఎంపికలోనూ అవకతవకలు జరిగాయని బాధితులు వాపోయారు. పీడీ పోస్టులు మూడు ఉండగా వన్ ఈస్టు త్రీ చొప్పున తొమ్మిది మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ముగ్గురిని ఎంపిక చేశారు. అయితే సెలక్ట్ అయిన అభ్యర్థులెవరూ వన్ ఈస్ట్ త్రీ జాబితాలో లేరని బాధితులు తెలిపారు. ఇదే సమయంలో లాంగ్వేజ్ పండిట్స్ నలుగురు, ఈ డబ్ల్యూఎస్ సర్టిఫికెట్లపై వచ్చిన అభ్యంతరాలతో 10 మందిని కలుపుకొని మొత్తం 21 మంది అభ్యర్థుల ఆర్డర్లు కాపీలను పక్కన పెట్టారు.

జిల్లాకు కేటాయించిన పోస్టులు 359

డీఎస్సీలో జిల్లాకు మొత్తం 359 పోస్టులు కేటాయించగా ఆయా రిజర్వేషన్ క్యాటగిరీల్లో అభ్యర్థులు లేక 60 పోస్టులు క్యారీ ఫార్వర్డ్ చేశారు. ఆ పోస్టులు బ్యాక్‌లాగ్ మారాయి. అవి పోను 299 పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో 169 ఎస్జీటీ తెలుగు మీడియం, ఉర్దూ మీడియంలో 26 ఎస్జీటీ పోస్టులు, లాంగ్వేజ్ పండిట్స్ 23, స్కూల్ అసిస్టెంట్ 81 ఉన్నాయి. ఇందులో ఫిర్యాదులు, అభ్యంతరాలతో 21 అభ్యర్థుల సర్టిఫికెట్లు నిలిపి వేయగా 278 మంది ఉద్యోగాల్లో చేరారు. అభ్యంతరాల పరిశీలనకు కలెక్టర్ ఫైవ్‌మెన్ కమిటీ వేశారు. ఇద్దరు అడిషనల్ కలెక్టర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారులు ఈ కమిటీలో ఉన్నారు. డీఈఓ ఈ కమిటీకి ఫెసిలిటేటర్‌గా వ్యవహరిస్తారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్

- ఎన్నికల హామీలు అమలు చేస్తాం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

మర్పల్లి: మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా మల్లేశ్‌యాదవ్, డైరక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా మర్పల్లి అంబేడ్కర్ విగ్రహం నుంచి మార్కెట్ షెడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాలక వర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలతో పాటు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సేవ చేసే భాగ్యం నూతన పాలక వర్గం సభ్యులకు దక్కిందని, బాధ్యతగా పని చేయాలని సూచించారు. అంతకుముందు పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి మాట్లాడారు. కేటీఆర్ సోషల్ మీడియాను వేదికగా మలచుకొని కాంగ్రెస్ పార్టీపై లేనిపోని ఆరోపణలు చేయిస్తున్నారని వాటిని పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు రూ.9 కోట్ల పైచిలుకు రుణ చెక్కులను అందజేశారు.

వసతి గృహం ప్రారంభం

మర్పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రాంభించారు. అనంతరం బీసీ బాలుర నూతన వసతి గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, మార్కెట్ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, బ్లాక్ -2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుభాష్ యాదవ్, రాములు యాదవ్, నాయకులు రవీందర్, రాచన్న దివాకర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ పాలక వర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి

నేడు ప్రమాణ స్వీకారోత్సవం

చేవెళ్ల: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎ.వీరేందర్‌రెడ్డి తెలిపారు. చేవెళ్లలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా జి.పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్‌గా రాములు, పాలకవర్గం సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు.

ఫార్మాకు భూములివ్వం



రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు

- అధికారులకు తేల్చి చెప్పిన రైతులు
- ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని వెల్లడి
- పోలేపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రభుత్వానికి నివేదిస్తామన్న కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

దుద్యాల్: ఫార్మా కంపెనీలకు ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇచ్చేది లేదని పోలేపల్లి రైతులు తేల్చి చెప్పారు. శుక్రవారం గ్రామంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసేకరణ అధికారి ఉమాశంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ కోసం ప్రభుత్వం గ్రామంలోని సర్వే నంబర్ 67లో 35మంది రైతులకు చెందిన 71 ఎకరాల భూమిని గుర్తించిందని తెలిపారు. ఇవి అసైండ్ భూములని వివరించారు. 35 మంది రైతుల్లో 15 మంది 35 ఎకరాల భూమిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మిగిలిన 20 మంది రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించడానికి వచ్చినట్లు వివరించారు. ప్రభుత్వం ఎకరా భూమికి రూ.10 లక్షల పరిహారం తోపాటు డీటీసీపీ లే అవుట్ కలిగిన 125 గజాల ఇంటి స్థలం , ఇంటికో ఉద్యోగం ఇస్తుందని తెలిపారు. ఇందుకు రైతులు ఒప్పుకోలేదు. భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఫార్మా కంపెనీలు కాకుండా ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని కొందరు రైతులు అన్నారు. విషపూరితమైన పరిశ్రమల ఏర్పాటును ఏ మాత్రం అంగీకరించమన్నారు. రైతులకు మద్దతుగా గ్రామస్తులు మాట్లాడే ప్రయత్నం చేయడంతో ఫార్మా ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న వారు అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. కోస్గి ఎస్‌ఐ శ్యాంసుదర్, మద్దూర్ ఎస్‌ఐ రామ్‌లాల్ పరిస్థితిని చక్కబెట్టారు. అనంతరం అధికారులు రైతుల అభిప్రాయాలను రాత పూర్వకంగా సేకరించారు. వీటిని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఒక వేళ ఫార్మాకు భూములు ఇవ్వాలనుకుంటే ఆర్డీఓ కార్యాలయంలో సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో దుద్యాల్ తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్, కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్‌ఐ రవికిశోర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి వార్డులో మురుగు కాలువలు నిర్మిస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న


తాండూరు: మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో మురుగు కాలువలు నిర్మిస్తామని చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆమె పర్యటించారు. రైల్వే గేట్ సమీపంలోని సత్యసాయిబాబా ఆలయ పరిసరాల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవస్తోందని స్థానికులు చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆమె మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని, విడతల వారీగా పనులు చేపడతామని తెలిపారు. అనంతరం మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డుల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వార్డుల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిని సకాలంలో పూర్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మురుగు కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

నెట్‌వర్క్ ఉద్దండాపూర్

- గ్రామంలో మొబైల్ సిగ్నల్స్ అందక అవస్థలు
- పెన్షన్ల కోసం పక్క ఊరికి పరుగులు
- అంబులెన్స్‌కు కాల్ చేయాలన్నా అవస్థలే
- రేషన్ బియ్యం పంపిణీకి సమస్యే
- ఇదీ ఉద్దండాపూర్ పరిస్థితి



ఉద్దండాపూర్ గ్రామ వ్యూ

తాండూరు రూరల్: అర చేతిలో ప్రపంచాన్ని చూస్తున్న రోజులివి. కానీ ఇప్పటికీ మొబైల్ నెట్‌వర్క్ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేదో ఏజెన్సీ ప్రాంతంలోని ఊరు అనుకుంటే పొరపాటే.. తాండూరు పట్టణానికి కేవలం 18కిలో మీటర్ల దూరంలోని ఉద్దండాపూర్ పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌కు ఫోన్ చేయాలన్నా మొబైల్ ఫోన్‌కి సిగ్నల్స్ రావడం లేదు. వృద్ధులు, వికలాంగులు పెన్షన్ల కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. సిగ్నల్స్ సమస్య కారణంగా రేషన్ కూడా తీసుకోలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

276 ఇళ్లు.. 950 జనాభా

తెలంగాణ – కర్ణాటక సరిహద్దులో ఉద్దండాపూర్ గ్రామం ఉంది. 276 ఇళ్లు, 950 జనాభా, 800 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామానికి కేవలం కిలో మీటరు దూరంలో కర్ణాటక రాష్ట్రం ఉంది. ఓ పక్క పచ్చటి పొలాలు.. మరో పక్క అటవీ ప్రాంతం.. ఆహ్లాదకరమైన వాతావరణం.. కానీ అక్కడి సమస్య అంతా మొబైల్ సిగ్నిల్స్ అందకపోవడమే. ఎయిర్‌టెల్ సిగ్నల్స్ వచ్చినా ఇళ్లల్లోకి నెట్‌వర్క్ అందడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఎత్తయిన ప్రాంతానికి వెళితే తప్ప ఫోన్ మాట్లాడే పరిస్థితి లేదని చెప్పారు. అత్యవసర సమయంలో ఫోన్ చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



రేషన్ బియ్యం కోసం ఇంటి పైకప్పు ఎక్కి సిగ్నల్ కోసం ప్రయత్నిస్తున్న యువకుడు

రేషన్ పంపిణీకి సమస్యే..

గ్రామంలో 400ల రేషన్ కార్డులు ఉన్నాయి. ఉద్దండాపూర్, గుండ్లమడుగు తండా, మైసమ్మ తండా వాసులు ప్రతి నెలా రేషన్ సరుకులు తీసుకెళ్తారు. రేషన్ బియ్యం పంపిణీకి సిగ్నల్ సమస్య ఎదురవుతోంది. ఇంటి పైకప్పు ఎక్కితేనే సిగ్నల్ వస్తోంది. దీంతో డీలర్లు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సిగ్నల్ అందక ఇబ్బంది పడుతున్న డీలర్

పెన్షన్ల కోసం పాట్లు

నెట్‌వర్క్ సమస్య కారణంగా వృద్ధులు, వికలాంగులు ప్రతి నెలా పింఛన్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామంలో 156 మందికి వివిధ రకాల పెన్షన్లు వస్తాయి. సిగ్నల్స్ రాకపోవడంతో పక్క గ్రామాలు మైసమ్మ తండా, గుండ్లమడుగు తండాకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఒకవేళ అక్కడ కూడా సిగ్నల్ రాకపోతే ఆరు కిలో మీటర్ల దూరంలోని జినుగుర్తి పోస్టాఫీకు పరుగులు తీయాల్సి వస్తోందని వృద్ధులు వాపోయారు. చాలా మంది ఆటోల్లో వెళ్లి పెన్షన్లు తెచ్చుకుంటున్నారు.

టవర్ ఏర్పాటు చేయాలి



ప్రతినెలా రేషన్ బియ్యం, పెన్షన్లు తీసుకోవడానికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఒక్కరి వద్ద ఫోన్ ఉంది. కానీ సిగ్నల్ మాత్రం రావడం లేదు. అత్యవసర సమయాల్లో ఫోన్ చేయాలంటే ఇంటి పైకప్పు లేదా పొలాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– కుర్వ దశరథ్, ఉద్దండాపూర్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



గ్రామంలో మొబైల్ సిగ్నల్స్ రాని విషయాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. నెట్‌వర్క్ సిగ్నల్స్ అందకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలను విన్నవించాం. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో సమస్య తీరుతుందని భావిస్తున్నాం.

– మినాజొద్దీన్, ఉద్దండాపూర్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో తిర్మలాపూర్‌వాసి మృతి


రాములు గౌడ్ (ఫైల్)

కుల్కచర్ల: నగరంలోని లంగర్ హౌస్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిర్మలాపూర్‌కు చెందిన రాములు గౌడ్ మృతిచెందారు. ఈయన గౌడ్ ప్రజా టైమ్స్ పక్ష పత్రిక సంపాదకుడిగా కొనసాగుతున్నారు. ఆయన మరణంపై కుల్కచర్ల మండల ప్రెస్ క్లబ్‌ప్రతినిధులు సంతాపం ప్రకటించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత


బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ

పెద్దేముల్: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఫిర్యాదు చేస్తే సీఐఆర్ యాప్ సహకారంతో గుర్తించి అందజేస్తామని ఎస్‌ఐ గిరి అన్నారు. సెప్టెంబర్‌లో దోమ మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన రత్నయ్య మండల పరిధిలోని మంబాపూర్ శివారులో ఫోన్ పోయిందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫోన్ పట్టేసిన పోలీసులు శుక్రవారం బాధితుడికి అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాండూరు టౌన్: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు టౌన్ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణ శివారులోని కాగ్నా నది నుంచి పాత తాండూరుకు చెందిన కుద్దుల రమేశ్ అలియాస్ రాము ఇసుక తరలిస్తున్నాడు. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేటి నుంచి వాటర్‌మెన్‌లకు శిక్షణ

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హకీల్



పెద్దేముల్: మండల పరిధిలోని 37 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న వాటర్‌మెన్‌లకు శనివారం నుంచి ఈ నెల 23వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పెద్దేముల్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హకీల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరికి మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటలకు పంప్ మెకానిక్, ఎలక్ట్రికల్స్, వాటర్ టెస్టింగ్‌పై శిక్షణ ఉంటుందన్నారు.

శిక్షణ ప్రారంభించనున్న ఎమ్మెల్యే

నవాబుపేట: ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాటర్‌మెన్‌ల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం 9గంటలకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభిస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయినాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల వాటర్‌మెన్‌లు తప్పక హాజర్వాలన్నారు.

యాసంగి సాగుకు వేళాయె..


నీటితో కళకళలాడుతున్న మంబాపూర్ చెరువు


పొలాన్ని సాగుకు సిద్ధం చేసిన రైతులు

- జిల్లాలో 1,14,601 ఎకరాల్లో పంటలు సాగు చేయవచ్చని అంచనా
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న వ్యవసాయ శాఖ

తాండూరు: యాసంగి పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నాయి. వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. మరోవైపు భూగర్భ జలాలు పైకి చేరాయి. దీంతో యాసంగి సీజన్ ఈ సారి ఆశాజనకంగా ఉండనుంది. వ్యవసాయ శాఖ అంచనాలకు మించి పంటలు సాగయ్యే అవకాశం కనిపిస్తోంది.

కలిసి రానున్న యాసంగి సీజన్

వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న జిల్లా రైతులకు ఈ సారి యాసంగి సీజన్ కలిసి రానుంది. వానాకాలం సీజన్‌లో భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులు యాసంగి సాగుపై దృష్టి సారించారు. జిల్లాలో యాసంగి సీజన్‌లో సాగు చేసే పంటల వివరాలతో వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా రానున్న సీజన్‌లో 1.14 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయవచ్చని అంచనా వేశారు. 80,980 ఎకరాల్లో వరి పంట వేయవచ్చని అధికారులు తెలిపారు. శనగలు 3,371 ఎకరాల్లో, వేరుశనగ 11,668 ఎకరాల్లో, మొక్కజొన్న, జొన్న, కుసుమ తదితర పంటలు మిగిలిన ఎకరాల్లో సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

నీటి వనరుల ఆధారంగానే..

యాసంగి సీజన్‌లో సాగునీటి ప్రాజెక్టుల ఆధారంగానే పంటలు సాగు చేయనున్నారు. వర్షాధార పంటలైన జొన్న, కుసుమ పంటలు మినహాయిస్తే మిగతా పంటలన్నీ సాగునీటి ద్వారానే పండనున్నా యి. జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు కలిపి 1,100 వరకు ఉన్నాయి. 67,217 బోరుబావులు ఉన్నా యి. వీటి ద్వారా పంటలకు నీరు అందనుంది.

ఎరువుల కొరత లేకుండా..

యాసంగి సాగుకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు తగ్గట్లు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాకు 28,293 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని అంచనా వేశారు. 11,387 మెట్రిక్ టన్నుల యూరియా, 6,100 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,696 మెట్రిక్ టన్నుల ఎంఓపీ, 6,787 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 2,381 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్పీ అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. వరి విత్తనాలు 24,304 క్వింటాళ్లు, వేరుశనగ 4,236 క్వింటాళ్లు, జొన్న 608 క్వింటాళ్లు, మొక్కజొన్న 920 క్వింటాళ్లు, శనగలు 1,808 క్వింటాళ్లు, కంది 91 క్వింటాళ్లు, పొద్దు తిరుగుడు విత్తనాలు 129 క్వింటాళ్ల అందుబాటులో ఉంచాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.

సాగు అంచనా

పంట	ఎకరాల్లో
వరి	80,980
జొన్న	7,478
మొక్కజొన్న	5,565
శనగ	3,371
కంది	615
వేరుశనగ	11,668
పొద్దతిరుగుడు	1,351
జీన్స్	55
గోధుమ	36
ఇతర పంటలు	3,482
మొత్తం	1,14,601

ఏర్పాట్లు చేస్తున్నాం

గత సీజన్‌తో పోలిస్తే ఈ సారి యాసంగి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా రానున్న సీజన్‌లో 1.14 లక్షల ఎకరాల్లో పంటల సాగు చేయవచ్చని అంచనా వేశాం. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం.
– మోహన్‌రెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

అన్ని గ్రామాలకు మౌలిక వసతులు

పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి


బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: నియోజకవర్గ పరిధిలోని ప్రతీ గ్రామానికి మౌలిక వసతులు కల్పిస్తామని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కండ్లపల్లి గేటు నుంచి గ్రామం వరకు నిర్మించ తలపెట్టిన బీటీ రోడ్డు పనులు, నిజాంపేట్ మేడిపల్లి గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కడుమూరు ఆనందం, రఘునాథ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు షకీల్, శ్రీనివాస్, అజీంపటేల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, నరేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీశైలం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, తిర్మలయ్య, అబ్బాస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌ఎంఎంఎస్'తో డిగ్రీ వరకు స్కాలర్‌షిప్



విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలు అందజేస్తున్న రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు

టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్

దుద్యాల్: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) అర్హత సాధించిన విద్యార్థులకు డిగ్రీ పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ అందుతుందని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో టీవీవీ, యూత్ ఫర్ సేవా సంయుక్త ఆధ్వర్యంలో పది మంది విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. 11 ఏళ్లుగా తమ సంయుక్త ఆధ్వర్యంలో 200 మందికి పైగా పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. గతేడాది 16 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న సతీశ్, స్నేహ, పుండరిక్షా, తారక్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విజయరామారావు, ఉపాధ్యాయులు రాములు, మల్లప్ప, సుధాకర్ శ్రీనివాస్, రవి నాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 'మాస్టర్ ప్లాన్'

డ్రోన్లతో డిజిటల్ సర్వే

- అమృత్ 2.0తో మున్సిపల్ అభివృద్ధికి బాటలు
- చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులరమేశ్
- కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులకు అవగాహన సమావేశం
- ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ సుధీర్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: డ్రోన్ కెమెరాల సాయంతో నిర్వహించే మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే.. భవిష్యత్తులో వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గం అత్యవసర సమావేశం నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ సుధీర్ ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు, మున్సిపల్ సిబ్బందికి మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వేపై అవగాహన కల్పించారు. డిజిటల్ సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద వికారాబాద్‌లో మొట్టమొదటిసారి డ్రోన్ కెమెరాల సాయంతో డిజిటల్ సర్వే చేసి, మాస్టర్ ప్లాన్ రూపొందించడం సంతోషంగా ఉందన్నారు. దీనిద్వారా మున్సిపల్ పరిధిలో ఎక్కడెక్కడ ఏమేం ఉన్నాయో సులువుగా తెలుసుకునే వీలు కలుగుతుందని తెలిపారు. భవిష్యత్తు తరాలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడటమే మాస్టర్ ప్లాన్ ప్రధాన ఉద్దేశమని స్పష్టంచేశారు. సర్వే కోసం ఆయా వార్డులకు వచ్చే డీటీసీపీ అధికారులకు సహకరించాలని కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ రాకేశ్‌రెడ్డి, డీటీసీపీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దుద్యాల్: వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా అండ్ ఫైలేరియా సబ్‌యూనిట్ అధికారి ఫకీరప్ప విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చెట్టుపల్లి తండా కేజీబీవీలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లేదంటే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, బోదకాలు లాంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయన్నారు. విద్యార్థులు టాయిలెట్స్‌ను శుభ్రంగా వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, టాయిలెట్స్‌లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సురేఖ, నందిని, నర్సమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు

బొంరాస్‌పేట: అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. తుంకిమెట్లకు చెందిన బల్ల కృష్ణ ఆరునెలల క్రితం మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి ఆసరగా ఉండేందుకు ఆయన భార్య జయమ్మకు శుక్రవారం కడా అధికారి వెంకటర్‌రెడ్డి రూ.లక్ష విలువైన చెక్కు అందజేశారు. ఆయన వెంట మండల నాయకుడు మల్లేశ్, రాంచంద్రారెడ్డి, బాలరాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


జయమ్మకు చెక్కు అందజేస్తున్న కడా అధికారి వెంకట్‌రెడ్డి

తప్పిపోయిన బాలుడు తండ్రి చెంతకు


భరత్‌కుమార్‌ను తండ్రికి అప్పగిస్తున్న ఎస్‌కేవీ ట్రస్ట్ సభ్యులు

దోమ: పదకొండేళ్ల వయస్సులో తప్పిపోయిన బాలుడిని తండ్రి చెంతకు చేర్చిన ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొక్క బాబు, యాదమ్మ దంపతులకు భరత్ కుమార్ ఏకైక సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో ఐదేళ్ల క్రితం యాదమ్మ కుమారుడిని తీసుకుని బతుకుదెరువు నిమిత్తం విజయవాడకు వెళ్లింది. 2021లో బాలుడు తల్లి వద్ద నుంచి కనిపించకుండా పోయాడు. ఆమె నిరక్షరాస్యురాలు కావడంతో పోలీసులకు కూడా ఫిర్యాదు చేయలేదు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా ఉన్న బాలుడుని చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది గుర్తించి ప్రశ్నించగా ఏ సమాధానం రాలేదు. దీంతో వారు బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి విజయవాడలోని ఎస్‌కేవీ ట్రస్ట్ సభ్యులకు అప్పగించారు. మూడేళ్లుగా ట్రస్ట్‌లోనే ఉంటున్న బాలుడుని సభ్యులు ప్రశ్నించగా వివరాలు వెల్లడించి తండ్రి వద్దకు వెళ్తానని చెప్పాడు. దీంతో ట్రస్ట్ సభ్యులు దోమ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ట్రస్ట్ సభ్యులు పోలీసులు, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి సమక్షంలో బాలుడి తండ్రి బాబుకు భరత్‌కుమార్‌ను అప్పగించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని అంశాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎంఈఓ గోపాల్

మండల విద్యాధికారి గోపాల్

పరిగి: బాలికలు ఉన్నతంగా రాణించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. పట్టణ కేంద్రంలోని బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతీ విషయంలో అవగాహన పెంచుకుని ముందుకు సాగాలని సూచించారు. బాలికల అక్రమరవాణా, ఈవ్‌టీజింగ్, బాల్యవివాహాలు, బాలికల విద్యాభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థులతో చర్చించారు. ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

కొత్త పంతుళ్లకు ఎంఈఓ పాఠాలు


కొత్త ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంఈఓ హరిలాల్

ఈఓ హరిలాల్

బొంరాస్‌పేట: 'బడులకు వెళ్లడమే కాకుండా బాధ్యతాయుతంగా పిల్లలకు చదువు నేర్పాలి' అంటూ కొత్త పంతుళ్లకు ఎంఈఓ హరిలాల్ పాఠాలు చెప్పారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు విధుల నిర్వహణ, బాధ్యతలు, మండల విద్యాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మండల విద్యార్థులు ఉన్నతంగా రాణించేలా చూడాలనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ సోమ్లా, శంకరయ్య న్నారు.

సర్దుబాటు చేయాలి: గోపాల్

ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ ద్వారా పాఠశాలలకు వచ్చిన నూతన ఉపాధ్యాయులతో కొంత సమస్య తీరిందని యూటీఎఫ్ మండలాధ్యక్షుడు గోపాల్ అన్నారు. సంపూర్ణంగా తీరాలంటే సర్దుబాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను కొనసాగించాలని కోరుతూ ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు.

న్యూసెన్స్ చేస్తే రూ.2 లక్షల జరిమానా

తహసీల్దార్ కిషన్


శ్రీనివాస్‌ను బైండోవర్ చేసిన పోలీసులు

పెద్దేముల్: మద్యం సేవించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ కిషన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగుపల్లికి చెందిన మట్ట శ్రీనివాస్ గురువారం రాత్రి మద్యం తాగి గ్రామంలో న్యూసెన్స్ చేశాడు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి శుక్రవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మురోసారి పునరావృతమైతే చట్టపరమైన చర్యలతో పాటుగా రూ.2లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నేడు, రేపు సీపీఎం జిల్లా మహాసభలు

పార్టీ జిల్లా కార్యదర్శి మైపాల్


దోమ: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

అనంతగిరి: సీపీఎం జిల్లా మూడో మహాసభలను శని, ఆదివారం తాండూరు పట్టణంలో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి మైపాల్ అన్నారు. శుక్రవారం ఆయన వికారాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ సభల్లో మూడేళ్లలో నిర్వహించిన పోరాటాలు, విజయాల గురించి చర్చించి భవిష్యత్ కార్యాచరణ, విద్యారంగం, కార్మికులు, ఉపాధి, రైతు కూలీలు, భూబాధితుల సమస్యలపై మాట్లాడుతారన్నారు. ఈ సభల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు, జగదీశ్, జిల్లాకమిటీ సభ్యులు పాల్గొంటారన్నారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సతీశ్, జిల్లా నాయకులు అక్బర్, నవీన్, యాదయ్య, జంగయ్య, దశరథ, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహా సభలను జయప్రదం చేయండి

దోమ: తాండూరు పట్టణంలో శనివారం, ఆదివారం నిర్వహించే సీపీఎం మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య పిలుపునిచ్చారు. దోమలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మిక, కర్షక, పేదల పక్షపాతి అయిన సీపీఎం మూడో మహాసభలను వైభవంగా నిర్వహిస్తామని స్పష్టంచేశారు. మొదటి రోజు తాండూరు భారీ ర్యాలీ, రెండో రోజు సుమారు 200 మంది ప్రతినిధులతో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు ఇందులో పాల్గొంటారన్నారు. సభలో కార్మిక, కర్షక, రైతు సమస్యలపై చర్చించడంతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తు న్న ప్రభుత్వాల తీరును ఎండగడతామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేసేలా ఆందోళన కార్యక్రమాలతో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లాలో మొదటిసారి నిర్వహిస్తున్న సభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యయ్య, రఘురాం, ఎచ్.సత్యయ్య, శేఖర్, అశోక్, మొగులయ్య, వెంకటయ్య, చెన్నయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: పార్టీ కార్యకర్తలకు వారి కుటుంబాలకు తాము అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చాపలగూడెం పంచాయతీలో చాపల చిన్న భీమయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబీకులను పరామర్శించారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్, రైతు బంధు మండల మాజీ అధ్యక్షుడు రాజు, నాయకులు జి.నర్సింలు, కె.నర్సింలు, మొగులయ్య, బిచ్చయ్య, బసప్ప, బుగ్గయ్య, రాములు, నర్సయ్య, చిన్న నర్సింలు, గండి నర్సింలు, గండి రాములు తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మహేశ్ రెడ్డి